ఎండాకుతో కలవరం

- దిగుబడి తగ్గే అవకాశం
- వాతావరణ మార్పులే కారణం
- ఆందోళనలో రైతులు



వరిపంటలో ఎండు తెగులు ఆశించిన వరి పంట

పెద్దాపురం: వరి పంటకు ఎండాకు తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని సుమారు 23 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. దీనిలో సాంబామసూరు సుమారు మూడు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ రకానికి ఎండాకు తెగులు వేగంగా సోకుతుంది. ఈ ఏడాది చోటు చేసుకున్న వాతావరణ మార్పుల కారణంగా ఈ తెగులు ఆశించింది. అధికంగా ఈ తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నాట్లు వేసిన అనంతరం షేడ్‌లో తీయాల్సి ఉంది. దీనివల్ల పంటకు చక్కగా గాలి తగులుతుంది. అంతేకాకుండా క్రిమి సంహారక ముందులు పిచికారీ చేయడానికి ఎంతో వీలుగా ఉంటుంది.

వేగంగా వ్యాప్తి

ఎండాకు తెగులు బ్యాక్టీరియా కారణంగా ఆశిస్తుంది. ఉదయం సమయంలో వరి ఆకులపై జిగురు ఏర్పడి, నీటి ద్వారా ఇతర పొలాలకు వ్యాపిస్తుంది. ఈ బ్యాక్టీరియా సోకగానే వరి ఆకు పసుపు రంగులోకి మారి ఎండిపోతోంది. వాతావరణం చల్లగా ఉన్నందున ఎండుతెగులు చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీంతో వరి పంట దిగుబడి బాగా తగ్గుతుంది.

యాజమాన్య పద్ధతులు

ఎండాకు నివారణకు ఎటువంటి మందులు లేవనే చెప్పవచ్చు. తాత్కాలిక ఉపశమనానికి యాజమాన్య పద్ధతులను పాటించాలి. పొలంలోని మురుగునీరు ఎప్పటికప్పుడు తీసివేయాలి. అలాగే పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఈ చర్యలు చేపడితే ఎండు తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.

నష్టపోతున్నాం



నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. ఎండాకు తెగులు ఎక్కువగా ఉంది. ఎన్ని మందులు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వాతావరణ మార్పులతోనే ఇది ఆశించింది. పంట వేసినప్పటి నుంచి వర్షం, ఎండలు, మంచు వల్ల పూర్తిగా దెబ్బతింటున్నాం. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలి. ఏ మందులు వాడినా ప్రయోజనం లేదు.
–సుందరెడ్డి రాజు, కౌలురైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

మందు లేదు



ఎండాకు తెగులుకు మందు లేదు. తెగులు ఆశించిన పొలంలో పూర్తిగా యూరియా ఎరువు తాత్కాలికంగా నిలిపివేయాలి. పోటాష్ ఎకరానికి 20 కిలోలు వేయాలి. పొలంలో మురుగునీరు తీసివేయాలి. తెగులు ఉధృతిని తగ్గించడానికి ఎకరానికి ప్లాంటోమిషిన్ 20 గ్రాములు, కాఫర్ ఆక్సిక్లోరైడ్ 400 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.
– కె.సంజయ్‌కుమార్, మండల వ్యవసాయ శాఖాధికారి, పెద్దాపురం

చిత్రలేఖనం పోటీలో ద్వితీయ స్థానం



స్వాతిలక్ష్మిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎం.స్వాతిలక్ష్మి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన్నట్టు పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామ కృష్ణ శనివారం సాయంత్రం తెలిపారు. కాకినాడ ఏపీఎస్‌పీ జెడ్పీ హైస్కూల్‌లో ఏఎంఓ ఎం.రామారెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు జరిగాయని తెలిపారు. తమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.స్వాతిలక్ష్మి డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థినిని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్‌లు అభినందించారు.

క్లుప్తంగా

ఎస్సైగా మురళీమోహన్



సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌కు మరో ఎస్సైగా రావూరి మురళీమోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణ భగవాన్, ఎస్సైలు మూర్తి, రమేష్ బాబు ఉండగా మూడో ఎస్సైగా మురళీమోహన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నియమించారు. ట్రాఫిక్ ఎస్సైతో కలిసి సామర్లకోటకు నలుగురు ఎస్సైలు ఉన్నారు. గతంలో ఇంద్రపాలెంలో ఉండే వీకే రాయపురం, బోయనపూడి, మాధవపట్నం, తిమ్మాపురంలో ఉండే ఉండూరు, అచ్చంపేట, పనసపాడు, గొంచాల, పవర, నవర, పి. వేమవరం, కాపవరం గ్రామలను సామర్లకోట పోలీసు స్టేషన్‌కు తీసుకు రావడంతో అదనపు ఎస్సైలను నియమించారు. అదే పోలీసు కానిస్టేబుళ్లను కూడా అదనంగా నియమిస్తే ట్రాఫిక్ నియంత్రణతో పాటు రాత్రి సమయంలో గస్తీకి ఉపయోగపడుతుందనే వాదనలు ఉన్నాయి. సాయంత్రం సమయంలో రద్దీగా ఉంటున్న మెహర్ కాంప్లెక్స్, బ్రౌన్‌పేట, బళ్ల మార్కెట్ సెంటర్, మఠంసెంటర్‌లో పోలీసులను నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వీరభద్రునికి పూజలు



పంచారామ క్షేత్రంలోని వీరభద్రస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్యకుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్వయుజ బహుళ తదియను అట్లతద్దిని పురస్కరించుకొని ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించి, పూజలు చేశారు. అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వేమూరి చంటి, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్ శర్మ ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, భక్త సంఘ సభ్యులు భక్తులకు సేవలందిం చారు.

ఫ్లైఓవర్‌పై నిలిచిన లారీ

ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట ఫ్లైఓవర్‌పై నిలిచిపోయిన లారీ

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ ముఖ్యకూడలి ప్రదేశంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న లోడ్ లారీ శనివారం నిలిచిపోయింది. దాంతో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరం నుంచి వస్తున్న లారీ ఫ్లైఓవర్ బ్రిడ్జి మలుపులో వైఎస్సార్ విగ్రహం వద్ద లారీ వెనుక చక్రాల యాక్సిల్ విరిగిపోయింది. దాంతో సుమారు మూడు గంటల పాటు లారీ నిలిచిపోయింది. తర్వాత ట్రాఫిక్ సిబ్బంది వచ్చి ట్రాఫిక్‌ను మళ్లించారు.

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: తల్లిదండ్రులు మృతి చెందిన ఓ కుటుంబానికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. మండలంలోని కొత్తమూలపేటకు చెందిన కొత్తపల్లి కుమారి ఇటీవల మృతి చెందింది. ఆమె భర్త కూడా గతంలో మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. నివసించేందుకు సొంత గృహం లేదు. అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. వీరికి చేయూతగా నిలిచేందుకు కొత్తమూలపేటకు చెందిన కొంత మంది యువకులు రూ.23 వేల విరాళం సేకరించారు. అదనంగా స్ఫూర్తి ఫౌండేషన్ సహాయ నిధి నుంచి రూ.7 వేలు కలిపి మొత్తం రూ. 30 వేలు ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు కుమ్మరి సతీష్, యాదల సుషాన్, గ్రామ యువత పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: బాలల పరిరక్షణ, సంక్షేమం అందించాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉంటుందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం డివిజన్ స్థాయి అధికారులుతో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ ప్రవీణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన విషయంలో ఎవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచాలన్నారు. బాలల పరిరక్షణకు మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా బాల్య వివాహలు జరిపితే బాల్య వివాహల నిరోధక చట్టం 2026, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ శ్రీరమణి ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ మాట్లాడుతూ సమన్వయంతో బాల్య వివాహల నిర్మూలనకు ప్రతి అధికారి పని చేయాలన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణాధికారి వెంకట్రావు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, అధికారుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఉష, పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎస్ఐ మౌనిక, జిల్లా బాలల పరిరక్షణ విభాగం పీఓ ఎన్ఐసీ విజయ, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఆయా ప్రాజెక్టుల ఐసీడిఎస్ సీడీపీఓలు, డివిజన్‌లోని ఎంపీడీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

పిఠాపురం: పిఠాపురం పట్టణంలోని జగ్గయ్య చెరువు శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద వేంచేసి యున్న శ్రీ భక్తాంజనేయ స్వామి మొదటి వార్షికోత్సవాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బాలిపల్లి రాంబాబు, అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు విజయ జనార్ధనాచార్యుల పర్యవేక్షణలో విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం, నాగవల్లి పత్ర సహిత సింధూర పూజ చేపట్టారు. అనంతరం విజయ జనార్ధనాచార్యులు స్వామివారికి 108 గారెలతో వడమాల సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సీపీఎం మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు తదితరులు

పెద్దాపురం: వచ్చే నెల 15, 16, 17వ తేదీల్లో పెద్దాపురం పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం కాకినాడ జిల్లా 24వ మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలు పెద్దాపురంలో నిర్వహించడం ఇది మూడోసారి అన్నారు. మహాసభలకు సంబంధించి పెద్దాపురం చారిత్రక అంశాలను పోరాట అంశాలను వివరిస్తూ లోగోను తీసుకువచ్చామన్నారు. ఏ ప్రభుత్వం అయిన ప్రజల సమస్యల కోసం నిలదీసే సత్తా సీపీఎంకే ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, కేదారి నాగు, గడిగట్ల సత్తిబాబు, పెంటయ్య, డి.కృష్ణ, విశ్వనాథం, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలి

- విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

పిఠాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగొచ్చని విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. శనివారం గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని తరగతులను పరిశీలించారు. 3,4,5 తరగతులకు చెందిన పిల్లల అభ్యసనా సామర్థ్యలను పరీక్షించారు. 6,7 తరగతుల విద్యార్థుల గణిత సామర్థ్యలను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. 8, 9 తరగతులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి అయినదీ, లేనిదీ తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఎంత మేర సిలబస్ పూర్తయినదీ ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బి.వెంకట శివ ప్రసాద్, రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వై.చంద్ర శేఖర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

పిఠాపురం: ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ ఆదివారం వినూత్న నిరసన నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు తెలిపారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారి ఆలయంలో గణపతి హోమం నిర్వహించి వినూత్నంగా తమ నిరసన తెలపనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు బీఎస్ఆర్ శర్మ, బీజే గాంధీ, ఓ రవిలు తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీఓ ఉత్తర్వులను ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ అమలు పరిచిందన్నారు. కేవలం విద్యాశాఖలోనే అమలు చేయలేదన్నారు. తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోక పోవడంతో గత్యంతరం లేని స్థితిలో నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ఉత్సాహంగా అట్లతద్దె



సామర్లకోట గోదావరి కాలువ వద్ద గౌరీదేవి పూజలు చేస్తున్న మహిళలు

- ఉయ్యాల ఆటలు
- చెరువుల వద్ద పూజలు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అట్లతద్దె వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. అట్లతద్దె అనగానే మహిళలు ఎంతో సంతోషంగా జరుపుకొంటారు. గ్రామాల్లో యువకులు తెల్లవారు జామున ఉప్పు పొట్లాలు తిప్పుతూ అట్లతద్దోయ్ ఆరోట్లోయ్, ముద్ద పప్పోయ్ మూడట్లోయ్ అంటూ మహిళలను నిద్ర లేపారు. తెల్లవారు జామున మహిళలు తలంటు స్నానాలు చేసి గొంగూర పచ్చడి, పెరుగుతో భోజనం చేసి ఉప వాస దీక్ష చేశారు. దీనిలో భాగంగా మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు. గ్రామాల్లో ఉయ్యాలూగుతూ మహిళలు సందడి చేశారు. దాంతో ఈ పండగ వాతావరణం నెలకొంది. ఈ మేరకు సాయంత్రం అట్లు వేసుకొని ముత్తైదువులకు అట్ల వాయినాలు ఇచ్చారు. పెళ్లి అయిన మహిళలు ఐదు అట్లతద్ది నోములు చేయాలని ఆచారంగా ఉంది. ఈ మేరకు సాయంత్రం గౌరీ దేవి పూజలు చేశారు. గ్రామాల్లో మహిళలు చెరువులు, గోదావరి కాలువ వద్ద గౌరీ దేవికి పూజలు చేసి దీపాలను వెలిగించారు. నవధాన్యాలను తాటాకు బుట్టలో ఉంచి మెలకెత్తిన జాజాలను నీటిలో విడిచి పెట్టారు. గ్రామాల్లో చెరువులు, ఏలేరు కాలువ, గోదావరి కాలువ రేవుల వద్ద మహిళలు పూజలు చేశారు.



కొత్తపల్లిలో గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

కొత్తపల్లి: అట్లతద్దె తెలుగువారి ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఈ పండుగ బహుళ తదియ నాడు జరుపుకుంటారు. అట్లతద్దె ఆరట్లో–ముద్దపప్పో మూడట్లో అంటూ మహిళలు ఆడపడుచులకు, బంధువులకు వాయినాలు ఇస్తారు. మండలంలోని శనివారం మహిళలు అట్లతద్దెని ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం వాయినాలు, దేవునికి నైవేద్యాలు పూర్తి చేసుకొని గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఉన్న చెరువులు, కాలువల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. చెట్లకు ఉయ్యాల కట్టుకొని పాటలు పాడుతూ ఊగారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలంతా ముందు రోజు గోరింటాకు పెట్టుకొని తదియ నాడు కొత్త వస్త్రాలు ధరించి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



సామర్లకోట కాంప్లెక్స్‌లో ఉన్న ప్రయాణికులు

సామర్లకోట: రాజమహేంద్రవరం, ఏలేశ్వరం ప్రాంతాలకు వెళ్లడానికి బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అట్లతద్దిని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణికులు స్థానిక రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడ నుంచి వారి వారి స్వగ్రామాలకు చేరుకోవడానికి బస్సులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాజమహేంద్రవరం వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ నుంచి వచ్చే బస్సులు సామర్లకోటకు రాక పోవడం వింతగా ఉందని ప్రయాణికులు ఆరోపించారు. కాగ కాకినాడ రోడ్డు అధ్వానంగా ఉన్న కారణంగా బస్సుల రాక పోకలకు జాప్యం జరుగుతుందని బస్సు కాంప్లెక్స్ కంట్రోలర్ తెలిపారు.

ఘనంగా గౌరీదేవి ప్రతిష్ఠ



కొమరగిరిలో గౌరీదేవి ఊరేగింపు

కొత్తపల్లి: మండలంలోని పద్మశాలి వీధిలో గురువారం రాత్రి గౌరీదేవి ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరీశంకర ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వరిదుబ్బును గౌరీదేవిగా భావించి ఆ రోజంతా ఉపవాస ముండి సాయంత్రం ఊరంతా ఊరేగించి ఆ తర్వాత బాలకన్య చేత ప్రతిష్ఠిస్తామన్నారు. 31 రోజుల పాటు గౌరీదేవికి ఆ కన్యచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలను నిర్వహించి కార్తీక పౌర్ణమికి మూడు రోజుల ముందు గౌరీశంకరుడిగా భావించబడిన నందీశ్వరుడిని ఊరేగింపుగా తీసుకొస్తామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలను నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆచారమని తెలిపారు. దీంతో గౌరీదేవి ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డులో గోతులు పూడ్చిన ట్రాఫిక్ ఎస్సై



గోతులలో క్రషర్ బూడిద వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఏడీబీ రోడ్డు అడుగు అడుగునా గోతులు పడిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై 'సాక్షి'లో 'అడుగు అడుగునా గోతులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు స్పందించారు. ఈ మేరకు 216 జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్న కంట్రాక్టరుతో చర్చించి క్రషర్ బూడిదను శనివారం గోతులలో వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోతులు కొంత వరకూ పూడ్చడంతో చిన్న వాహన చోదకులకు కొంత మేరకు ప్రమాదాలు తప్పాయనే చెప్పవచ్చు. స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ క్రషర్ బూడిద ఎండలు ఎక్కువగా వచ్చిన సమయంలో వాహనాల రాక పోకలు పైకి లేచి పొతుందని చిన్న వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల తాకిడి

- స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- ఒక్కరోజే రూ.1.62 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,62,446 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.. ఈ సందర్భంగా సుమారు ఏడు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా మూడు వేల మంది స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలే కెనరా బ్యాంకు ధ్యేయం



పెద్దాపురం కెనరా బ్యాంక్ బ్రాంచిని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

పెద్దాపురం: ఖాతాదారులకు ఉత్తమ సేవలందించడమే తమ బ్యాంక్ ధ్యేయమని కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ (విజయవాడ) జనరల్ మేనేజర్ సీజీ విజయలక్ష్మి అన్నారు. పెద్దాపురం పట్టణ మరిడమ్మ ఆలయ సమీపంలోని ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన కెనకా బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా తమ బ్యాంకు పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీలు మట్టే సత్యప్రసాద్, వి.సత్య సాయిరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ప్రముఖ వ్యాపార వేత్త మట్టే శ్రీనివాసరావు, బ్యాంక్ డివిజనల్ మేనేజర్లు ఎం.శ్రీనాథ్, ఏకే మహంతి, పెద్దాపురం బ్రాంచి మేనేజర్ అమిత్‌కుమార్, బ్యాంకు అధికారులు వై.తవిటయ్య, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

సామర్లకోట: మున్సిపల్ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని పట్టణ సీపీఎం కార్యదర్శి కరణం గోవిందరావు అన్నారు. శనివారం సీపీఎం మహాసభలు సందర్భంగా సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆవిర్భావం అయినప్పుడు 1956లో ఉన్న పారిశుధ్య కార్మికుల సంఖ్యే నేడూ కొనసాగుతోందన్నారు. పట్టణ జనాభా రెట్టింపు కావడంతో పాటు నివాస ప్రాంతాలు పెరిగిపోవడంతో పారిశుధ్య కార్మికులపై పని భారం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం వేసే ప్రక్రియలను ప్రారంభిస్తోందని, దీనిలో భాగంగానే స్మార్ట్ మీటర్ల విధానం, ట్రూ అఫ్ చార్జీలు వేయడమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభకు జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు అధ్యక్షత వహించగా పార్టీ నాయకులు కరణం శ్రీనివాసు, దారబాని కృష్ణ, కరణం సత్యనారాయణ, కోన శివకుమార్, సైపురెడ్డి యువరాజు తదితరులు పాల్గొన్నారు.